క్లుప్తంగా

నేడు మండల సమావేశం

లక్కిరెడ్డిపల్లె : నేడు బుధవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి తెలియజేశారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

16న లోక్ అదాలత్

రైల్వేకోడూరు : ఈనెల 16వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ అంజనీ ప్రియదర్శిని మంగళవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కేసులను రాజీ చేసుకొని కేసులు పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిన్నమండెం : చిన్నమండెం మండల తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ కాగా అక్కడ కొద్ది రోజులు ఎలక్షన్ సెక్షన్‌లో విధులు నిర్వహించి అక్కడి నుంచి చిన్నమండెం మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనునాయక్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లె ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం 110 శాతం సాధించి విజయవంతం చేసినట్లు వైద్యాధికారి రాజశేఖర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ఆరోగ్య కేంద్ర పరిధిలో పోలియో చుక్కలను అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వేశామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 1447 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 1550 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. బయట నుంచి వచ్చిన కూలీలను గుర్తించి వారి పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

సన్మానం

రామాపురం : మండల కేంద్రంలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయులు ఆనంద్ రాజుకు సర్. సీవీ రామన్ అకాడమీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ కంకణం తొడిగి చిత్రకళాబ్రహ్మ బిరుదును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ గుహేశ్వరి పసుపతినాథ ఆలయం నిర్మాణం నిమిత్తం సంబేపల్లె పూర్వపు వాస్తవ్యులు ఓంకారం శ్రీకాంత్ జ్ఞాపకార్థం రూ. 1 లక్షలు విరాళాన్ని వారి కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలానే మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముంగర కాళిదాసు చక్రవర్తి రూ. 25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, కమిటీ ఉపాధ్యక్షుడు అంజిరాజు, కోశాధికారి ఖగేంద్ర రాజు, కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, సాయి కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి జీవితానికి వెలుగు



రక్తదానం చేస్తున్న సీఐ సుధాకర్ రెడ్డి

రాయచోటి అర్బన్ : రక్తదానం మరొకరి జీవితానికి వెలుగునిస్తుందని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక దీపా బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వలన వ్యక్తి ఆరోగ్యంగా ఉండడంతోపాటు ఆపద సమయాల్లో మరొకరి ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మహమ్మద్, హరినాథరెడ్డి, క్లబ్ సభ్యులు, పోలీసులు, రక్తదాతలు పాల్గొన్నారు.

దోభీ ఘాట్‌లో నూతన మోటారు, పంపు ఏర్పాటు

పుల్లంపేట : మండల కేంద్రపు గ్రామ పంచాయతీలో దోభీ ఘాట్ కోసం గతంలో ఏర్పాటు చేసిన మోటారు తరచూ మరమ్మతులకు గురి కావడంతో రజకులు నానా ఇబ్బందులు పడేవారు. మంగళవారం విషయాన్ని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి కొత్త మోటారు, పంపు సెట్ దోభీ ఘాట్ కోసం ఏర్పాటు చేశారు. దీంతో రజకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, బోగా పార్థసారథి, బికె మణి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను పాల్గొన్నారు.

మరో పట్టణంలా జగనన్న కాలనీ

- రాయచోటిలో ప్రతి అర్హుడి సొంతింటి కల నెరవేర్చాం
- జగనన్న కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

రాయచోటి అర్బన్ : పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ లబ్ధిదారుల ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రాయచోటి పట్టణంలో 25వేల గృహాలు ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వంలో పట్టణ పేదల కోసం నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో 6500 పక్కాగృహాలు మంజూరు కావడంతో అక్కడ మరో పట్టణం రూపుదిద్దుకుంటోందన్నారు. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, విద్యుత్‌సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. మహిళలను అన్ని రంగాల్లో జగన్ ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. అమ్మ ఒడి, డ్వాక్రా రుణాల మాఫీ, చేదోడు, చేయూత తదితర పథకాలను మహిళలకు అందించి వారి ఆర్థికాభివృద్ధికి జగనన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

పట్టణాభివృద్ధి ఎలా ఉందో ఆలోచించండి..

గతంలో రాయచోటి ఎలా ఉండేదో, ప్రస్తుతం పట్టణం ఎలా ఉందో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రి, ఆర్‌టీసీ బస్టాండు విస్తరణ, మున్సిపల్ సభా భవనం, వైట్ మున్సిపల్ పార్కు, నగరవనం, శిల్పారామం, స్టేడియం నిర్మాణం తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 3వ తరగతి నుంచి డిగ్రీ వరకు బాలికలకు ఒకే ప్రాంగణంలో విద్యా సౌకర్యం అందేలా ఏర్పాటు చేశామన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభించి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశామన్నారు.

ఇళ్లపట్టాల లబ్ధిదారులకు సర్వహక్కులు

జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలను పొందిన లబ్ధిదారులకు, ఆ స్థలాలపై సర్వ హక్కులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన ఇంటి స్థలాలపై మహిళలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలను అందించడం జరుగుతోందన్నారు. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో 6050 రిజిస్ట్రేషన్‌లకు గాను నేటికి 5395 రిజిస్ట్రేషన్‌లు పూర్తయ్యాయన్నారు. ఇక 655 రిజిస్ట్రేషన్‌లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

నియోజకవర్గంలో శాంతి నెలకొల్పడమే లక్ష్యం

ఒకప్పుడు రాయచోటిలో గలాటాలు, రౌడీయిజం, గూండాయిజం రాజ్యమేలయన్నారు. ఆ పరిస్థితుల నుంచి రాయచోటిని ప్రశాంతంగా తీర్చిదిద్దగలిగామన్నారు. నియోజకవర్గాన్ని శాంతియుతంగా చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు వండాడి వెంకటేశ్వర్లు, తబ్రేజ్‌ఖాన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు హబీబ్‌ఖాన్, మహమ్మద్‌ఖాన్, కొలిమి హరూన్‌బాషా, సుగవాసి ఈశ్వర్, జానం రవీంద్ర, గౌస్‌ఖాన్, అల్తాఫ్, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, అన్నా సలీం, విజయభాస్కర్, పల్లా రమేష్, గువ్వల బుజ్జిబాబు, అయ్యవారురెడ్డి, హజరత్కక ఖాదర్‌వలీ, జిఎండి ఇర్షాద్, నేలపాటి వెంకటేష్, కొత్తపల్లె ఇంతియాజ్, మూసా కరీముల్లా, రౌనఖ్‌హుస్సేన్, కొలిమి చాన్‌బాషా, రియాజుర్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు నడుమ గంగ జాతర

- ఛాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి
- లక్కిరెడ్డిపల్లె సీఐ గంగనాథ బాబు



మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగనాథ్ బాబు

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 10, 11, 12వ తేదీలలో మూడు రోజులపాటు జరిగే గంగమ్మ జాతరను పటిష్ట బందోబస్తు నడుమ నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఎస్ఐ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ అమ్మవారికి చాందినీ బండ్లు తిప్పేవాళ్లు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. చాందినీ బండ్ల ఎత్తు పది అడుగుల లోపే ఉండాలన్నారు. చాందినీ బండ్లు ముందు అశ్లీల నృత్య ప్రదర్శనలు, రికార్డు డ్యాన్సులు, సౌండ్ సిస్టమ్‌లు పెట్టకూడదన్నారు. జాతరకు వచ్చే భక్తులు కుటుంబ సమేతంగా వారివారి వాహనాలలో జాగ్రత్తగా జాతరకు చేరుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని దొంగతనాలు, మద్యం విక్రయాలు, జూదాలు వంటి కార్యకలాపాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

రేపటి నుంచి మహాశివరాత్రి బస్సు సర్వీసులు



డీఎం రమణయ్య

రాజంపేట : ఈనెల 7 నుంచి 10 వరకు మహాశివరాత్రి బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు రాజంపేట డిపో మేనేజరు గుండాల రమణయ్య తెలిపారు. మంగళవారం ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల రాకపోకలకు ఇబ్బంది పడకుండా రవాణా పరంగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. డిపో పరిధిలో అత్తిరాల, తలకోన, గుండాలకోనలకు బస్సు సర్వీసులు నడిపిస్తున్నామన్నారు. రాజంపేట నుంచి తలకోనకు పది బస్సులు చార్జి రూ.250లు ఉంటుందన్నారు. రాజంపేట – అత్తిరాలకు పది బస్సులు వేస్తున్నట్లు, రూ.20ల చార్జి ఉంటుందన్నారు. కోడూరు – గుండాలకోనకు 11 బస్సులు నడిపిస్తున్నామన్నారు. చార్జి రూ.80 ఉంటుందన్నారు. వైకోట – గుండాలకోన మధ్య కూడా బస్సు సర్వీసులు నడిపిస్తున్నామన్నారు. చార్జి రూ.60గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ అందిస్తున్న బస్సు సర్వీసు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సుఖవంతమని ప్రయాణీకులకు మహాశివరాత్రి సందర్భంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

వేసవి ప్రణాళికలు సిద్ధం చేయండి



రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

- మండల సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే మేడా సూచన
- రిజిస్ట్రేషన్ పట్టాలను జగనన్న కాలనీ లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే

ఒంటిమిట్ట : వేసవికాలం ప్రారంభమైనందున సూర్యుడు ప్రతాపం నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రణాళికలను మండల అధికారులు సిద్ధం చేసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందు సభలో వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్ రెడ్డి మృతి పట్ల రెండు నిమిషాలపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి ఎమ్మెల్యే మేడా మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరు స్వర్గీయ ఎంపీపీ గెడ్డం జనార్దన్ రెడ్డి అని, ఆయన వైఎస్సార్‌సీపీకి ఎంతో విధేయుడిగా కష్టపడ్డారన్నారు. ప్రస్తుతం జనార్దన్ రెడ్డి మన మధ్యలో లేకుండా పోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. అనంతరం మండలంలోని పలు శాఖల సమస్యలను, వాటి పరిష్కారాలు గురించి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అధికారులతో చర్చించారు. ఇందులో ముఖ్యంగా పెన్నపేరూరులోని ఏడో విడత భూ పంపిణీ, అలాగే పెన్నా నదిలో ఉన్న సీపీడబ్ల్యూ సీకు నీటి సరఫరా సమస్య, చింతరాజుపల్లి, చిన్న కొత్తపల్లి, నడవకాటిపల్లిలో గత కొద్దిరోజుల కింద నుంచి ఉన్న తాగునీరు సమస్యల పరిష్కారాన్ని గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో చర్చించారు. సభ మండలంలోని జగనన్న కాలనీలో స్థలాలు మంజూరైన వారికి స్థానిక సచివాలయాలలో రిజిస్ట్రేషన్ అయిన పట్టాలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ రాము, ఈఓపీఆర్‌డీ రంగయ్య, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ, పాల డైరీల ప్రారంభం

మండల పరిధిలోని గంగపేరూరు పంచాయతీలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, పాల డైరీలను మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ప్రారంభించారు. ముందుగా ప్రారంభానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మేడాకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం డిజిటల్ లైబ్రరీ, పాలడైరీని మేడా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ రాము, ఈఓపీఆర్‌డీ రంగయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక స్వావలంబనతోనే రాష్ట్రాభివృద్ధి

- సంక్షేమ పథకాలు ప్రతి తలుపు తట్టాయి
- జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ
- పాల్గొన్న విప్ కొరముట్ల శ్రీనివాసులు



చిట్వేలి: లబ్ధిదారులకు హక్కుపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



రైల్వేకోడూరు అర్బన్: బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

చిట్వేలి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకంలో భాగంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలాలను అందజేశామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీపీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను జగనన్న కాలనీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఆర్థిక స్వావలంబన చెందినప్పుడే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాన్ని అమలుపరుస్తున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి గడపకు పథకాలు చేర్చామన్నారు. చిట్వేలి – కోడూరు రోడ్డును కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించామన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే గాక గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించామన్నారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేలా ఆశీర్వదించాలని తెలియజేశారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించిన ప్రతిపక్షాలు.. ప్రస్తుతం జగనన్న ప్రవేశపెట్టిన పథకాలకు పేర్లు మార్చి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంక్షేమం ఇస్తే శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు నోటనే సంక్షేమ పథకాలు తీసేయ్యము.. అమలు చేస్తాము అని చెప్పేలా చేసిన వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌నే అని, ఇది వైఎస్సార్‌సీపీ విజయమే అని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మలిశెట్టి వెంకటరమణ, డైరెక్టర్ లింగం లక్ష్మీకర్, తహసీల్దార్ జ్ఞానేశ్వరి, ఎంపీడీఓ రంగారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణంలోని రెడ్డివారిపల్లి నూతన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన ఆదేశించారు. బ్రిడ్జి పనులు పూర్తయితే ఇక్కడ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, రాజంపేట, పి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని కట్టావారిపల్లె దళితవాడలో మంగళవారం మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏపీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న బోర్లలో ఉప్పు నీరు రావడంతో తాగునీటి కోసం దళితులు ప్రతి రోజూ మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన మాటకు అనుగుణంగా ఈ రోజు ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి దళితవాడలకు శుద్ధి చేసిన నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సర్పంచ్ బాలు మోహనమ్మ, భర్త శివయ్య నాయుడు, కాంట్రాక్టర్ అమరేశ్వర్ రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో పిల్లలను చేర్పించండి



అప్లికేషన్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ఏపీ మోడల్ స్కూల్‌లో పిల్లలకు మంచి గుణాత్మక విద్యను అందిస్తున్నామని, ఆరవ తరగతిలో ప్రవేశానికి ఏపీ మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు అప్లికేషన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరవ తరగతి నుంచి ఏపీ మోడల్ స్కూల్‌లో సీబీఎస్ సిలబస్‌తోపాటు, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ కోర్సులు, ఆంగ్లంలో సృజనాత్మక విద్యను అందిస్తున్నామని, మీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. కావున తల్లిదండ్రులు ఏపీ మోడల్ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడటం, పోటీ పరీక్షల్లో పాల్గొనడం, క్రీడల్లో విజయాలు సాధించడం, ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేయించాలని ప్రధానోపాధ్యాయులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్‌లో బుధవారం ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ కార్యక్రమం జరుపనున్నట్లు హెచ్‌పీసీఎల్ డిపో సీనియర్ మేనేజర్ మన్మధరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్‌డీఎంఏ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహిస్తామన్నారు. మాక్ డ్రిల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొంటారని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

రామాపురం : రైతుల రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. మాట్లాడుతూ భూములకు సంబంధించిన 1బీ, అడంగళ్, ఇంటి పట్టాలు, భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి కోనలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను సేవా భావంతో పనిచేసి జయప్రదం చేయాలని తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని కల్యాణ మండపంలో మంగళవారం సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు, వీఆర్‌ఓలకు మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 300 మందికి పైగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారని నిత్యపూజ స్వామి కోనలో ఈనెల 7, 8, 9 తేదీలలో జరిగే ఉత్సవాలకు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిత్యపూజ స్వామి కోనలో జరిగే ఉత్సవాలకు ఎక్కడి నుంచో భక్తులు వస్తారని, సమన్వయంతో భక్తులకు సేవలందించాలన్నారు. అధికారుల అంచనాల మేరకు దాదాపు 2 నుంచి 3 లక్షల మంది భక్తులు ఉత్సవాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. సిబ్బంది తాము అందుబాటులో ఉంటామని, భక్తులకు సిబ్బంది నిస్వార్థం, అంకితభావతంతో విస్తృత సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ ప్రసాద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రామాయణంలోని ఆదర్శ జీవన విధానాన్ని అనుసరించాలి

ఓబులవారిపల్లె : రామాయణంలోని ఆదర్శ జీవిత విధానాన్ని అనుసరించి ఆదర్శవంతమైన జీవితాన్ని ప్రతి ఒక్కరూ గడపాలని తిరుమల, తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కటికంవారిపల్లి శ్రీకృష్ణ మందిరంలో టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక ఉపన్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వెంకటరమణ మాట్లాడుతూ రామాయణాన్ని ప్రతి ఒక్కరూ పఠించాలని, సనాతన ధర్మాన్ని గురించి తెలుసుకొని సన్మార్గంలో నడిచి జీవన శైలిలో మార్పు తీసుకురావాలన్నారు. ప్రస్తుత వేగవంతమైన జీవన విధానంలో ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. అనంతరం రామాయణం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు ఎ.లీలావతమ్మ, కె.జయమ్మ, పి.వెంకటసుబ్బమ్మ, సావిత్రమ్మ, శ్రీనివాసులు, కటికం ధనుంజయ, కటికం నాగేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు సకాలంలో అందజేయాలి

నందలూరు(రాజంపేట) : లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు సకాలంలో అందజేయాలని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీని నందలూరులోని దిగువ వీధిలో నివసిస్తున్న ఐదు సంవత్సరాల బాలిక ఫాతిమా తల్లిదండ్రులు ఆరోగ్యశ్రీ రాలేదని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులను వెంటనే గుర్తించి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక ఫాతిమాకు వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు బాలిక వైద్యానికి అయిన ఖర్చును ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితురాలిని ఆదుకునేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. అలానే రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కలిముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నందలూరులోనే స్థలాలివ్వాలి

నందలూరు(రాజంపేట): నందలూరు, నాగిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని అర్హులైన పేద ప్రజలకు నందలూరులోనే ఇంటి స్థలాలు ఇవ్వాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ సెక్రటరీ సయ్యద్ అమీర్ కోరారు. మంగళవారం ఆయన లబ్ధిదారులతో కలిసి అధికారులను కలిశారు. ఆయన మాట్లాడుతూ గతంలో నల్ల తిమ్మయ్యగారిపల్లి పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారన్నారు. దీంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేడా, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. నందలూరు పంచాయతీ పరిధిలో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలంలోనే లబ్ధిదారులకు ఇంటిపట్టాలు ఇవ్వాలన్నారు.

పోస్టర్‌ల ఆవిష్కరణ

రాయచోటి అర్బన్ : మార్చి 9, 10 తేదీలలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న పౌర హక్కుల సంఘం 50 సంవత్సరాల ముగింపు సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్‌లు కోరారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద సభకు సంబంధించిన పోస్టర్‌లను ఏపీసీఎల్‌సీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు ఎం.రవిశంకర్, పి.రెడ్డెయ్య, వి.రమణ, ఝాన్సీలక్ష్మిలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిద్దవటం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గ్రామస్తులు సహకరించాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్నలు కోరారు. మండల కేంద్రంలోని ఎగువపేట బస్టాండ్ ఆవరణలో మంగళవారం రాత్రి ఎన్నికలపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీఐ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఘర్షణలకు తావివ్వకూడదన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడి ఒక్కసారి కేసులో చిక్కుకుంటే కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రాజు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.